భవిష్య నిధికి వడ్డీ జమ చేయాలి

- జెడ్పీ సీఈవో గ్లోరియాకి యూటీఎఫ్ విజ్ఞప్తి

జెడ్పీ సీఈవోకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జెడ్పీ ఖాతా దారులకు గత 3ఏళ్ల వడ్డీ జమ చేయాలని యూటీఎఫ్ చిత్తూరు జిల్లా శాఖ జిల్లా పరిషత్ సీఈవోకు బుధవారం విన్నవించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల జెడ్పీ పిఎఫ్ ప్రొవిడెంట్ ఫండ్‌కు సంబంధించి 2019-2020 నుంచి నేటి వరకు ఎవరి ఖాతాలో ఎంత సొమ్ము ఉన్నది ఏ ఏ సంవత్సరంలో వడ్డీని జమ చేశారనే వివరాలు లేక సతమతమవుతున్నారని వారు తెలిపారు. వెబ్సైట్ పనిచేయడం లేదంటున్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. అన్ని జిల్లా పరిషత్ సీఈఓలను సమాచారం కోరిన పంచాయత్ రాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వారు 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు వడ్డీని మంజూరు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరి ఉన్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు 2019 నుంచి నేటి వరకు బూస్టర్ స్కీం కింద వడ్డీ జమ చేసి ఎవరి ఖాతాలో ఎంత నగదు నిల్వ ఉందో వివరాలను సమగ్రంగా తెలియపరచాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని వారు వివరించారు. సీఈఓ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమగ్ర వివరాలను తెప్పించుటకు గూగుల్ ఫార్మ్ ద్వారా సమాచారం డిడిఓల నుంచి తెప్పించడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఏపిజిఎల్ఐ కార్యాలయంలో ఉన్న సమస్యలను ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఈఓ సి.దేవరాజుని కలసి ఇటీవల జరిగిన పదవ తరగతి మూల్యాంకన సొమ్మును ఉపాధ్యాయులకు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే కార్యాలయంలో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణి గండన్, కార్యదర్శులు డి.ఏకాంబరం, ఎం.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కాటేస్తున్న కల్తీ మద్యం



- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- చితికిపోతున్న చిన్న కుటుంబాలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కష్టజీవులు రోజంతా పని చేసి సాయంత్రానికి ఊరటకోసం కాస్త మందేస్తే ప్రస్తుతం మద్యం షాపుల్లో అమ్ముతున్న కల్తీ బ్రాండ్‌లతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను పెంచినా క్యాలిటీ విషయంలో ప్రమాణాలు పాటించకపోవడంతో జేబులు ఖాళీ కావడంతో పాటు కుటుంబాలు చితికిపోతున్నాయి.

చీప్ లిక్కర్ క్వాటర్ కొనుగోలు చేయాలన్నా.. రూ.150 వెచ్చించాల్సి వస్తోంది. ఇలా తీసుకుంటున్న మద్యం క్వాలిటీ విషయం తెలియని పరిస్థితి. నాశిరకం మద్యం సేవించడం వల్ల రోజుకు 40 నుంచి 50మంది కాలేయం దెబ్బతిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఏటా రెండు వేలు ఓపిలు చూడాల్సి ఉంటుంది. అయితే ఏడాదికి నాలుగు వేలకు పైగా కాలేయ వ్యాధి కేసులు పెరుగుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స కోసం వస్తున్న వారిలో ఎక్కువశాతం యువకులే ఉంటున్నారు. ఎక్కువ కాలంగా మద్యం సేవిస్తున్నా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం కాలేయ సమస్యలొస్తున్నట్లు మద్యం సేవించి కాలేయవ్యాధితో బాధపడుతున్నవారు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ, రక్త ప్రసరణలో ఇబ్బందులు ఏర్పాడుతున్నట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చెబుతున్నారు.

చిత్తూరు జిల్లాలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ రోజుకు 48గంటల ముందు మద్యం విక్రయాలను ఆపేసి మద్యం షాపులను సీజ్ చేశారు. సోమవారం ఎన్నికలు జరిగితే శుక్రవారం జిల్లాలో కోటీ 30లక్షలకు పైగా మద్యం దుకాణాల్లో వ్యాపారం జరిగింది. ఎన్నికల సందర్భంగా కర్నాటక, గోవా మద్యం పోలీసుల కళ్ళుగప్పి గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ సాగింది. ఎన్నికల ముందు రోజు వరకు జిల్లా వ్యాప్తంగా 514మందిపై అక్రమ మద్యం కేసులు నమోదు చేసి 8,300మద్యం స్వాదీనం చేసుకున్నారంటే పోలీసులకు తెలియకుండా అక్రమ మద్యం జిల్లాలో ఏ స్థాయిలో ఏరులైపారిందో అర్థమవుతోందని విశ్లేషకులంటున్నారు. బంగారుపాళ్యంలో అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ మద్యం పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. కార్వేటినగరంలో 432అక్రమ మద్యం బాటిల్స్ స్వాదీనం చేసుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజవర్గాలో అక్రమ మద్యం కేసులున్నాయి.

కర్ణాటక టెట్రాప్యాకెట్లు

పొరుగు రాష్ట్రం కర్నాటక నుంచి టెట్రా ప్యాకెట్లు జిల్లాలో చాటుమాటుగా విక్రయిస్తున్నారు. ఎన్నికల సమయంలో వీటి అమ్మకాలు జోరుగా సాగాయనే చెప్పాలి. ఏపి మద్యం సీసా కొనుగోలు చేయాలంటే రూ.150 వెచ్చించాలి. కర్నాటక మద్యం టెట్రా ఫ్యాకెట్‌కు రూ.40 వెచ్చిస్తే సరిపోతుంది.

కొందరు కర్నాటక నుంచి అక్రమ మార్గంలో చిత్తూరు జిల్లా సరిహద్దు కావడంతో జిల్లాలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారంలో రాజకీయ పార్టీలకు చెందిన నేతలుండటంతో పోలీసులకు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదే తరహలో గోవా నుంచి అక్రమ మార్గంలో మద్యం తరలించి జిల్లాలో ఓటర్లకు ఎరవేశారు. జిల్లాలో అక్కడక్కడా గోవా మద్యం పట్టుబడింది.

దినసరి కూలీలు బలి

తాగే అలవాటున్న వారిలో ఎక్కువ మంది దినసరి కూలీలు, శారీరక శ్రమ చేస్తూన బతికేవారే మద్యం తాగడంతో వారిలో నిష్సత్తువ, నీరసం అవహించడం, కళ్ళు, చేతులు వణకడం, ఆయసంతో గతంలో మాదిరి శ్రమించలేకపోతున్నారు. ఫలితంగా ఇలాంటి ఆదాయం తగ్గిపోతోంది. రోజు మద్యం సేవిస్తున్న వారు సత్తువ కొల్పొయి నెలలో 10 నుంచి 15 రోజులు దినసరి కూలీ పనులు చేయలేకపోతున్నారు. 2024 ఎన్నికల్లో క్వాలిటీ మద్యం ఓ ప్రధాన చర్చగా సాగింది. అధికార పార్టీ నాశిరకం మద్యంతో పేదల ప్రాణాలు తీస్తోందంటూ ప్రతిపక్ష పార్టీ నిప్పులు చెరిగింది. తాము అధికారంలోకి వస్తే క్వాలిటీ మద్యం అమ్మకాలతో పాటు మద్యం ధరలు తగ్గిస్తామంటోంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్ర ఆర్థిక విభాగంలో ఎక్సజ్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయనిదే అగ్రభాగం కావడంతో ఏపార్టీ సంపూర్ణ మద్య నిషేదం చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయింది.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పటిష్టమైన భద్రత నడుమ బ్యాలట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్స్ 24గంటలు నిరంతరంగా పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు విధులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. బుధవారం ఆయన ఎస్వీ సెట్ కళాశాలకు చేరుకొని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. జిల్లాలో ప్రాశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి, ఇతర రాష్ట్ర పోలీసులు కేంద్ర బలగాలకు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎం బాక్స్‌లను ఎస్‌వి సెట్ కాలేజీకి తరలించగా వాటిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ మణికంఠ చందోలు అధికారులతో కలిసి కాలేజీ పరిసరాలను, పార్కింగ్ ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రతను కల్పించాలని, పటిష్టమైన భద్రత నడుమ ఈవీఎంలకు రక్షణ కల్పిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించిన, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడ 5గురికి మించి గుంపులు, గుంపులుగా ఉండకూడదని, అనుమతులు లేకుండా ఎక్కడ సభలు, ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. ఎవరైనా అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు, పెళ్లిళ్ల, అంత్యక్రియలకు మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు 144సెక్షన్ జిల్లాలో అమలవుతుందన్నారు. జిల్లా ప్రజలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్లా, చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, ఏఆర్ డిఎస్పీ మహబూబ్ బాషా, పూతలపట్టు ఇన్స్పెక్టర్ సుదర్శన ప్రసాద్, ఆర్ఐ నీలకంటేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర : టీటీడీ ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాజకీయ విభేధాలు పక్కన బెట్టి మనమందరం గంగమ్మ జాతరను గొప్పగా నిర్వహించుకుందామని టీటీడీ ఛైర్మన్ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానికంగా 15 మండపాల్లో గంగమ్మ విగ్రహాలను ప్రతిష్టించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడిగా గంగమ్మ జాతర చేసుకుందామని, సాక్షాత్తు తిరుమల నంబి, అనంతాళ్వార్ల అమత హస్తాలతో పునర్నిమితమైన దేవాలయం ఇది అని అన్నారు. భారతదేశంలో జాతర ఉత్సవాలు నిర్వహించే సంస్కృతి తిరుపతి నుంచే ప్రారంభమైంది అని చెప్పారు.

బైరాగి వేషాలతో అలరించిన చిన్నారులు

మొన్నటి వరకూ ఎన్నికల ప్రచారాలతో మోతెక్కిన తిరుపతి నగర వీధులు.. ఇప్పటి నుంచి ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో జరిగే ప్రముఖ జాతరల్లో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. బుధవారం ఉదయం చిన్నారులు బైరాగి వేషంలో నగరంలో సందడి చేశారు. తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి వచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద బైరాగి వేషాలతో సందడిగా నెలకొంది. భక్తులు తమ శరీరానికి తెల్లటి రంగు పేస్ట్ (నామ్ కొమ్ము) పూసుకుని, "రెల్ల కాయ" పండ్లతో చేసిన దండను ధరిస్తారు. భక్తులు తమ చేతులలో వేప ఆకులను పట్టుకుని వేపఆకులతో నడుముకు కట్టుకుంటారు. ప్రజలు కాలినడకన ఆలయానికి చేరుకుంటారు, అమ్మవారి దర్శనం తర్వాత ఆలయం వద్ద ఆ వేప ఆకులు, రెల్లకాయ మాలలను అక్కడ వదిలివేస్తారు. జాతర సందర్భంగా ఆలయ అధికారులు విస్తత ఏర్పాట్లు చేశారు. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్, తుడా ఆరోగ్యశాఖతోపాటు విద్యుత్ శాఖ సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

తిరుపతి ప్రజలు చల్లగా ఉండాలని కోరుకున్నా.. ఆరణి శ్రీనివాసులు

తిరుపతి ప్రశాంతంగా ఉండాలని గంగమ్మ తల్లిని కోరుకున్నట్లు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గంగమ్మ తల్లి దీవెనెలను ప్రతి ఒక్కరిపైనా మెండుగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన చెప్పారు. ఆరణి శ్రీనివాసులు తన జన్మదినం సందర్భంగా గంగమ్మ తల్లిని సతీసమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఆరణి దంపతుల పేరిట అర్చన చేసి దీవెనలు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కారణంగా జాతర ఆలస్యమైనా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటుండటం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తిరుపతి మహర్దశ మారాలని గంగమ్మను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి ఆరణి శ్రీనివాసులు దర్శించుకున్నారు. తెలుగుదేశం, జనసేన, బిజేపి నాయకులు కార్యకర్తలు మధ్యాహ్నం ఆరణి శ్రీనివాసులు ఇంటికి చేరి ఆయనకు శుభాంకాంక్షులు తెలిపారు. పలువురు నాయకులు భారీ కేకులు తెచ్చి ఆయన చేత కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం: కమిషనర్ అదితి సింగ్

శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర జరిగే అన్ని రోజుల్లో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని సౌకర్యాలను, ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులకు గంగమ్మ జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణ కోసం ఆలయ పరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లించాలని, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయించాలని, అదేవిధంగా మెడికల్ క్యాంప్, అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డికి, అదేవిధంగా శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతిలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు తాగునీరు ఏర్పాట్లకు, చక్కటి నిర్వహణకు కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. ఆలయం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని, స్ట్రీట్ లైట్లు అన్ని వెలిగేలా చూడాలని ఎలక్ట్రికల్ ఇంజనీర్లు సుబ్బరామయ్య, నరేంద్రలను ఆదేశించారు. అలాగే ఆలయం దగ్గర ముందు జాగ్రత్తల కోసం అగ్నినిరోధక చర్యల కోసం ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ ఫైర్ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనాథ్ రెడ్డిలకు తగు సూచనలు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఇబ్బందులు కల్గించే ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యంలకు ఆదేశాలు జారీ చేశారు. జాతర ముగింపు రోజు 21వ తేది మంగళవారం ప్రత్యేక చర్యలు తీసుకొని అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్ పాల్గొన్నారు.

పులివర్తి నానిని పరామర్శించిన 'దగ్గుమళ్ళ'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు బుధవారం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి కలికిరి మురళిమోహన్, చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు సీఆర్ రాజన్, టిడిపి సీనియర్ నేత చంద్ర ప్రకాష్, మాజీ మేయర్ హేమలత ఉన్నారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు మంగళవారం వెళ్ళిన పులివర్తి నానిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయన గాయపడి అపస్మారక స్థితికి చేరుకోవడంతో నానిని స్విమ్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను ప్రముఖులు పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో దాడిని వారు ముక్తకంఠంతో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసుల వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందని దాడికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

మాతా శిశు మరణాలపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మాతా శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి బుధవారం డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో 13 శిశు మరణాలు 1 మాతృ మరణంపై కేసుల వారిగా వైద్యాధికారి, పర్యవేక్షకులు, ఏఎన్ఎం, ఆశ, అంగన్ వాడి కార్యకర్తలతో ముఖాముఖిగా చర్చించి భవిష్యత్‌లో మాతృ మరణాలు జరగకుండా, నివారణ చర్యలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆదేశించారు. ఈ మధ్యకాలంలో ఎక్కువ కేసులు హార్ట్ అరెస్ట్‌తో చనిపోతున్నారు. కావున ప్రతి గర్భిణీకి ఈసీజీ పరీక్ష, ఈసీజీలో ఇబ్బందులు ఉంటే ఎకో పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి వారికి తగిన చికిత్స చేయుట, రక్తహీనత రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తతో మాతృ మరణాలకు లేకుండా చూడొచ్చు, ప్రతి గర్భిణీ స్త్రీకి ఉచిత వైద్యం ప్రభుత్వం నందు, ప్రైవేట్ నందుగానీ ఆరోగ్యశ్రీ ద్వారా జెఎస్‌ఎస్‌కె తప్పక ఉపయోగించుకుని అందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ స్థాయిలోని హైరిస్క్ గర్భవతులకు అన్నీ పరీక్షలు నిర్వహించి ప్రణాళిక ద్వారా కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రి నందు చేర్పించిన యెడల వారికి ఆర్థిక రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. మొదటిసారి గర్భం దాల్చిన గర్భవతులపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బిడ్డబిడ్డకు కనీసం మూడు సంవత్సరములు కాల వ్యవధి ఉండేలా గర్భవతులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఏదో ఒక కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను అవలంబించేటట్లు చేయుట ద్వారా మాతృమరణాలను తగ్గించాలన్నారు. తల్లికి అధిక రక్తపోటు, రక్తహీనత, పౌష్టికాహార లోపం వలన కాన్పు సమయంలో జరిగే మాతృ మరణాలను వైద్యాధికారులు ముందస్తు ప్రణాళికల ద్వారా నివారించాలని, సరైన పద్ధతిలో కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. కాన్పు అయిన తరువాత వైద్యులు వైద్య సిబ్బంది బాలింతలను సందర్శించి తల్లి, బిడ్డ యొక్క ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన చికిత్సలు అందించి మాతృ, శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ లత, డాక్టర్ మాలతి, డాక్టర్ దీప, డాక్టర్ జానకిరావు, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరు మృతి
- ఆరు గురికి గాయాలు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇద్దరు మృతి ఆరు మందికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి మొగిలి సమీపంలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మయ్య సమాచారం మేరకు.. కీరమంద గ్రామానికి చెందిన నాగభూషణం, రాజయ్య, జయచంద్ర, బాబు, వేణు, రాజులు గ్రామంలో వరిగడ్డి తీసుకొచ్చేందుకు సదుం వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్ను ఢీకొంది. అందులో వస్తున్న ఆరు గురికి లారీ డ్రైవర్ భద్రాచలం చెందిన రామారావుకు తీవ్ర గాయాలు కాగా ప్రథమ చికిత్స కోసం పలమనేరు బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంగారుపాలెంలో జగన్నాథం కుమారుడు రాజు రాజమాణిక్యం కుమారులు వేణులు మృతి చెందారు. గాయాలైన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. గంగాధర్ నెల్లూరు మండలం ఆవులకొండ గ్రామానికి చెందిన అజరాలి, ఘజియాబాషా ఇద్దరు యువకులు చికెన్ దుకాణంలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తమ గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో బంగారురెడ్డిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బిఎన్ఆర్ పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిత్తూరు: లారి కింద పడి ఉన్న యువకుల మృతదేహాలు

బంగారుపాళ్యం: ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన రాజు, వేణు

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తమ కార్యాలయంలోని సిబ్బందిని సమావేశానికి పంపరాదని ముఖ్యంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

చిన్నప్ప మృతికి నివాళి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పెద్దపంజాణి గ్రామంలోని సీనియర్ రాజకీయ నాయకులు శ్రీనివాసులు తండ్రి చిన్నప్ప బుధవారం మృతి చెందారు. స్థానికుల సమాచారంతో మాజీ ఎంపీపీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి హాజరై మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: కులం పేరుతో దూషించారని బాధితుడు విజయ్‌కుమార్ బుధవారం బంగారుపాళ్యం సీఐకి ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం నల్లగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడు కుమారుడు సోమేష్, ప్రభు, మునస్వామి నాయుడు కుమారుడు శంకర్‌నాయుడులు ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండలేదనే కారణంగా తమను కులం పేరుతో దూషించారని, దౌర్జన్యం చేశారని తెలిపారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దిరెడ్డిని కలిసిన ఎంపీపీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటినగరం ఎంపీపీ లతాబాలాజీ బుధవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధి కృషి చేస్తుండడం ఆనందంగా ఉందని ఎంపిపి పనితీరును పెద్దిరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, కో ఆప్షన్ సభ్యులు పట్నం ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గోపినాథ్, జేజేలు రెడ్డి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

మే పుష్పాల కళకళ

ప్రజాశక్తి-ఐరాల: సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే అది కూడా మే నెలలో మాత్రమే వికసించే మే పుష్పాలు గత 4సంవత్సరాలుగా చిత్తూరు జిల్లా కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో వికసిస్తున్నాయి. గతంలో ఒక పుష్పం మాత్రమే వికసించే మే పుష్పం ఈ సంవత్సరం విరగభూసింది. చూపరులను ఆకర్షించే ఈ మే పుష్పం చూడడానికి పుష్పం ఎంతో అందంగా కనిపించింది.

బిసిజి టీకాపై అవగాహన

ప్రజాశక్తి-సోమల: కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 2025 నాటికి రాష్ట్రంలో పూర్తిగా కుష్టు వ్యాధి నిర్మూలనచే దిశగా బీసీజీ వ్యాక్సిలను వేయనున్నట్లు కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని అంచలంచెలుగా తగ్గించే క్రమంలో భాగంగా ప్రభుత్వం 18సంవత్సరాల పైబడిన వయస్సు వారికి బీసీజీ టీకాను అందించడం ద్వారా క్షయ వ్యాధి రాకుండా నివారించవచ్చునున్న ముఖ్య ఉద్దేశంతో క్షయ నివారణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారుల సంయుక్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. మూడు నెలల పాటు టీకా వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రతి ఒక్కరూ టీకాను వేసుకునే విధంగా వైద్య ఆరోగ్య శాఖ వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ విద్యాలయానికి విద్యార్థి ఎంపిక

భానుప్రకాష్

ప్రజాశక్తి - వెదురుకుప్పం, కార్వేటినగరం: మండల పరిధిలోని గాజంకి దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదుతున్న విద్యార్థి కే.భానుప్రకాష్ ఏపీ రెసిడెన్షియల్ విద్యాలయానికి ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం రూప తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గత నెల 25వ తేదీ నిర్వహించిన ఏపీ ఆర్ఎస్ క్యాట్ పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి వంద మార్కులకు 80మార్కులు సాధించి ఏపీ రెసిడెన్షియల్లో విద్యాలయంలో ఓపన్ కేటగిరిలో సీటు సాధించి ప్రభుత్వ పాఠశాల ప్రతిభను నిరూపించుకోవడం జరిగిందన్నారు. అతి చిన్న వయస్సులో పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆ గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రగిరి రాజకీయాలకు చెవిరెడ్డి మరక: నరసింహయాదవ్

మాట్లాడుతున్న టిడిపి నాయకులు నరసింహయాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంచి చరిత్ర కలిగిన చంద్రగిరిలో రాజకీయాలకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హత్యా రాజకీయాలకు తెరలేపి మరకలు అంటించారని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా చంద్రగిరి నియోజక వర్గంలో అధికార దాహంతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుట్ర రాజకీయాల్లో చేస్తూ ఏకంగా ప్రత్యర్థి అభ్యర్థిని అంతమొందించాలని ఆలోచన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఈవీఎంల భద్రతకు అధికారులు ప్రాధాన్య త కల్పించకుండా ఈవీఎం లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములు పరిశీలించడానికి వెళ్లిన టిడిపి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై, ఆయన వ్యక్తిగత గన్‌మ్యాన్‌పై మారణాయుధాలతో దాడి చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ఈ ఘటనపై పార్లమెంట్ అధ్యక్షుడి హోదాలో కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి, డీజీపీకి లేఖ రాశానన్నారు. ఇంత జరుగు తున్న హింసాత్మక ఘటనలను చిత్రీకరించడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులు, విలేకరులపై కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పోలీసు అధికారి ఆదేశాలతో సిఆర్పిఎఫ్ బలగాలు లాఠీలతో తెగబడడం, గాయపరచడం మంచి పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులపై లాఠీఛార్జి దారుణమన్నారు. నాని ఘటనలో గాయపడిన గన్మెన్ ధరణి విషయంలో పోలీస్ అసోసియేషన్ స్పందించాలన్నారు. జర్నలిస్టుల విషయంలో పోలీసులు స్పందించి వారికి స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహించుకునే లాగా పరిస్థితులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ నేత జగన్నాథం, మనోహరాచారి, రామారావు, లోకేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300కు పెంచాలి

మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్ రాసా రాయుడు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే రోజు కూలిని రూ.300కు పెంచాలని తిరుపతి జిల్లా అంబుడ్స్ పర్సన్ రాసారాయుడు పేర్కొన్నారు. మండలం లోని బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఎపిఓ భానుప్రియ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి జిల్లా అంబుడ్స్ పర్సన్ రాసారాయుడు హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలను పెంచాలని వారికి పనులు ఎక్కువగా కల్పించాలని వారి రోజువారి వేతనం 300 రూపాయలకు తగ్గకుండా పని చూపించాలని వారు ఆదేశం చారు. అంతే కాకుండా ఎండ తీవ్రతను బట్టి ఉపాధి కూలీల ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి తాగునీరు, ఉండడానికి నీడ సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ఎండ ఉన్నచోట కాకుండా చల్లటి ప్రదేశాలలో వారికి పని కల్పించాలని సూచించారు. ఉదయం 6 గంటలకే ఫీల్డ్‌పై ఫీల్డ్ అసిస్టెంట్లు వెళ్లి వారికి కావలసిన పరికరాలు అందించాలని సూచించారు. దగ్గరుండి వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు ఏపీవో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఉపాధి కూలీలకు విరివిరగా పనులు కల్పించాలని డ్వామా పీడీ డ్వామా పీడీ సివి శ్రీనివాస్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఏర్పేడు మండలంలోని రావిళ్ల వారి కండ్రిగ, పెనుగడ్డం పంచాయతీల్లో నిర్వహిస్తున్న పార్కులేషన్ పాండ్, ఫారం పాండ్ పూడిక తీత పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు తీవ్రమవుతున్నందు వల్ల ఉద యం 6 గంటలకు పని మొదలుపెట్టి కొలతల ప్రకారం పనిచేసి 10 గంటల కల్లా పని విడిచి పెట్టాలని, పని వద్ద తాగునీరు, నీడ, గ్రామంలోని ఏఎన్ఎంల సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టె వంటివి పని ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు బోర్లు, బావులలో నీరు పుష్కలంగా ఉండేందుకు రైతుల పొలాలలో ఫారం పాండ్లను తవ్వి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రైతులకు ఇస్తున్న పళ్ల, పూల తోటలు, నిమ్మ చెట్లు, మామిడి, జీడి మామిడి, బత్తాయి, నాటు జామ, తైవాన్ జామ, తదితర తోటలను మూడు సంవత్సరాల ఉపాధి హామీ ద్వారా రైతులు పెంపకం చేపట్టినందుకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, సిడిసిఎల్ ఆర్‌సి చంద్రశేఖర రాజు, జూనియర్ ఇంజనీర్ పాండజా బాలాజీ రావు, రావిల్లా వారి కండ్రిగ ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ చంద్రయ్య పాల్గొన్నారు.

సత్యవేడులో గెలుపుపై ఎవరి ధీమా వారిది..

ఆశల ఊహల్లో అభ్యర్థులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ ఘట్టం సోమవారం ముగిసింది. ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కౌంటింగ్ ఘట్టం మిగిలి ఉండడంతో బరిలో ఉన్న అభ్యర్థులకు గెలుపు ఓటములపై ముచ్చెమటలు పడుతున్నాయి. రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గమైన సత్యవేడులో టీడీపీ, వైసీపీ మధ్యే తీవ్ర పోటీ నెలకొంది. మంగళవారం పోలింగ్ వివరాలు అధికారి కంగా అందడంతో వాటిని ముందేసుకుని లెక్కలు కడుతున్నారు. పోలింగ్ సరళిపై ఆయా పార్టీ నేతలు , కార్యకర్తలతో ఆరా తీస్తున్నారు. నియోజకవర్గంలో తమకు ఎక్కడ ఎక్కువ ఓట్లు పడ్డాయి? ఎక్కడ తక్కువపడ్డాయి? అనే వివరాలను విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నారు. దీని ఆధారంగా తమ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయనే విషయంలో అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు టీడీపీకి అనుకూలంగానే ఉన్నాయని, గెలుపు ఖాయమనే ధీమాతో టీడీపీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలో పోలింగ్ సరళి సైతం అలాగే ఉందని రాజకీయ విశ్లేషకులు కూడా భావిస్తున్నారు. దీంతో టీడీపీలో జోష్ కనబడుతోంది. కాగా క్రాస్ ఓటింగ్‌పై ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రధానంగా నియోజకవర్గంలో అధికార పార్టీ ఓట్లు భారీగా చీలినట్లు తెలుస్తోంది. టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఆదిమూలం, వైసీపీ తరఫున రాజేష్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఆదిమూలం పై మళ్లుతోందని, దీంతో ఓట్లన్నీ గంపగుత్తగా తమకే పడతా యని వైసీపీ భావించింది. కానీ ఎంపీ ఓటింగ్ విషయంలో జరిగిన క్రాస్ ఓటింగ్ టీడీపీ అభ్యర్థికి లాభం చేకూర్చేలా ఉందన్న చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా గతంలో టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన జెడి రాజశేఖర్ ఈసారి కూడా టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీలో నిలబడటం అభ్యర్థి ఆదిమూలంకు కాస్త ఇబ్బందే.. స్వతంత్ర అభ్యర్థి యాతాటి రమేష్ బాబు కూడా పోటీలో ఉండడం టిడిపి అభ్యర్థికి ఇబ్బంది కరంగా మారింది. ఈ ఇద్దరూ టిడిపి ఓట్లు మాత్రమే తమ వైపునకు తిప్పుకున్నారు. జూన్ 4వ తేదీ నిర్వహించే కౌంటింగ్‌లో ఏ పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూస్తున్న ప్రజలు నాయకులు కన్నా ఎక్కువ ఆలోచనలో పడ్డారు. ఇటు అధికార పార్టీయా? ఇటు ప్రతిపక్ష పార్టీయా? లేదంటే స్వతంత్ర అభ్యర్థులా..? జూన్ నాలుగో తేదీ ఫలితం తేల్చాల్సి వుంది. అప్పటి వరకు నియోజకవర్గపు ప్రజలు వేచి చూడాల్సిందే..

సజ్జల ప్రెస్‌మీట్ తర్వాతే అరాచక దాడులు: రవినాయుడు

మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం అనంతరమే రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి సానుభూతిపరులపై, టిడిపి నాయకుల ఇళ్లపై ఇష్టానుసారం దాడులు జరుగుతున్నాయని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా? బీహార్‌లో ఉన్నామా?' అని ప్రశ్నించారు. ఎన్నడూ లేని విధంగా హత్యా రాజకీయాలు తెరమీదకు తీసుకొస్తున్నారని, ప్రత్యర్థి అభ్యర్థులను చంపేస్తా మనే ఆలోచన చాలా ప్రమాదకరమైందని దీనిపై ఎన్నికల సంఘం, డిజిపి, గవర్నర్ తక్షణమే స్పందించి లా అండ్ ఆర్డర్ ను అదుపు చేయాలని కోరారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద స్ట్రాంగ్ రూమ్ వద్దకు మారణాయుధాలతో అధికార పార్టీకి సంబంధించిన నాయకులు ఎలా ప్రవేశించారని ప్రశ్నించారు. పులివర్తి నానిని అంతమొందించాలని కుట్రతో మారణా యుధాలతో స్ట్రాంగ్ రూమ్ ఆవరణ లోకి వైసీపీ గూండాలు ప్రవేశిం చారని, చంద్రగిరి రిటర్నింగ్ అధికారిపై తమకు అనుమా నాలు ఉన్నాయన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి విలేకరులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రగ్స్, గంజాయిపై చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్, తోట వాసు, రంజిత్ కుమార్, రఫీ, గోపి, సంతోష్, పవన్, నాగరాజు, గణేష్, సురేష్, శివ పాల్గొన్నారు.

చదువులో దిట్ట..గోల్డ్ మెడల్‌తో పట్టా...

బయోటెక్నాలజీలో ఓజిలి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఓజిలి : 'పిట్ట కొంచెం... కూతఘనం' అనే రీతిలో సూళ్లూరుపేట నియోజకవర్గం టీఎన్‌టియూసీ అధ్యక్షులుగా ఉన్న మంగళపూరి చందన్ కుమార్ ఫ్రాంక్లిన్ తన రెండో సోదరి చదువులో దిట్టగా ఉత్తమ ప్రతిభను కనపరుస్తూ విద్యావేత్తల వద్ద ప్రశంసలు అందుకుంటూ గోల్డ్ మెడల్‌తో పట్టాను అందుకోనున్న విద్యార్థిని పలువురుకి ఆదర్శవంతంగా నిలుస్తోంది. ఓజిలి గ్రామానికి చెందిన మంగళపూరి ప్రిస్కిల్లా విక్రమ సింహపురి యూనివర్సిటీ బయో టెక్నాలజీలో గోల్డ్ మెడల్ సాధించడం ద్వారా ఓజిలి మండలం కీర్తి ప్రతిష్టను పెంచుతూ విద్యారంగంలో కలికితురాయిగా నిలిచింది. మంగళపూరి మనోహర్ రవికుమారి దంపతుల రెండవ కుమార్తె అయిన ప్రిస్కిల్లా ఎల్‌కెజి నుండి చదువులో చురుకైన విద్యార్థినిగా ఉపాధ్యాయుల వద్ద ప్రశంసలు పొందారు. ఆమె తల్లి రవికుమారి ప్రభుత్వ ఉపాధ్యాయు రాలుగా, తండ్రి మనోహర్ పాస్టర్‌గా పనిచేసేవారు. ప్రిస్కిల్లా తన విద్యాభ్యాసాన్ని ఓజిలి మండలం కురుగొండలో ఉన్న హరి ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఎల్‌కెజీ నుండి ప్రారంభమై సెకండ్ క్లాస్ వరకు కొనసాగింది. తరువాత 3వ తరగతి నుంచి 6 వరకు నాయుడు పేట లోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు లోనూ, 7వ తరగతి నుంచి 10 వరకు గూడూరు లోని ప్రాస్పరో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కొన సాగింది. చదువుల తల్లిగా పేరు ప్రఖ్యాతలు పొందిన ప్రిస్కిల్లా 2013లో 9.2 జిపిఏతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిం ది. 2015 లో శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ లో బైపిసి గ్రూపు నుండి 91శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించింది. 2019 లో గూడూరు డిఆర్‌డబ్ల్యు మహిళ కళాశాలలో బిఎస్సి (బిబిసి) 9.06 జిపిఏతో ఉత్తీర్ణురాలైంది. 2021 లో ఎంఎస్‌సి (బయో టెక్నాలజీ) 9.83 జిపిఏ విక్రమ సింహపురి యూనివర్సిటీలో గోల్డ్ మెడలిస్టుగా రికార్డ్ పొందారు. ప్రిస్కిల్లా తండ్రి మనోహర్ అనారోగ్యంతో మృతి చెందినా కృంగిపోకుండా విద్యనభ్యసించింది. తన సోదరుడైన ఫ్రాంక్లిన్ ఆమె ప్రతిభను చూసి, మరింతగా ప్రోత్సహించాడు. బయో టెక్నాలజీలో గోల్డ్ మెడల్ రావడం మరింత ఆనందాన్ని తెచ్చి పెట్టింది. ఈ నెల 22న నిర్వహించే 8వ కాన్వొకేషన్ లో గవర్నర్ చేతుల మీదుగా ఆమె గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. ప్రిస్కిల్లా కు ఎమ్మెస్సీ బయోటెక్నాలజీలో గోల్డ్ మెడల్ రావడంపై, పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

శిక్షణా తరగతులకు

అధిక విద్యార్థుల హాజరు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని సాయి నగర్ కళామందిర్‌లో తెలుగు సాహిత్య సమితి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వేసవి తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరైనట్లు సంస్థ అధ్యక్షులు తులసినాథం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నైతిక విలువలను ఆటపాటలతో చదువుతూ వారికి నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలకు చదువు ముఖ్యమని ప్రతి ఒక్కరు చదువుకొని వారి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తేవాలని విద్యతో పటు నైతిక విలువలు తప్పనిసరి అన్నారు. కవి జొన్నవిత్తుల రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి పంచలోహ తాపడం

ధ్వజ స్థాభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీదౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభానికి జీలావారికండ్రిగ గ్రామానికి చెందిన హనుమంతయాదవ్ కుటుంబ సభ్యులు బుధవారం రూ.4లక్షలు వెచ్చించి పంచలోహ తాపడం చేయించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొలిపి అచర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దాత హనుమంతయాదవ్ మాట్లాడుతూ ధ్వజస్తంబానికి రూ.4లక్షలతో వెండి తాపడం చేయించానని చెప్పారు. ఈ క్రమంలోభాగంగా హనుమంతయాదవ్ కుటుంబ సభ్యులను ఆలయ ధర్మకర్తలు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో నందిబోయని మునిసుబ్రమణ్యం, మునిలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

'వృద్ధులను తల్లిదండ్రులతో సమానంగా చూసుకోవాలి'

వృద్ధులకు అన్నదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వెదురు కుప్పం, కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు టిడిపి జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి కె.సందని జన్మదిన సందర్భంగా బుధవారం వృద్ధాశ్రమంలో కేకును కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్నారు. అనాధులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా పుట్టినరోజు వృద్ధులతో కలిసి జన్మదిన వేడుకలచేసుకుంటా అన్నారు. వృద్ధులను తల్లిదండ్రులతో సమానంగా చుసుకోవాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో షబానా, రవి యాదవ్, యువరాజ్, జగన్నాథం, రాజశేఖర్, గురువర్మ, పార్థసారథి, జ్యోతి, దినకర్, సుమన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

భార్గవి - రోస్వీత

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరానికి గాను(ఏపీ రెసిడెన్షియల్ స్కూల్) గురుకుల పాఠశాలకు ఎంపిక అయినట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఎల్లయ్య తెలిపారు. ఎస్.భార్గవి, ఎం.రోస్వీత, తుషార ముగ్గురు విద్యార్థులు బైరెడ్డిపల్లి మండలం కమ్మనపల్లి గురుకుల పాఠశాలకు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు గురుకుల పాఠశాలకు సెలక్ట్ కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ రవి రాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చిత్తూరు జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ రవి రాజు జన్మదినం పట్టణంలోని స్థానిక షిరిడి సాయిబాబా నిత్య అన్నదానం సేవా మందిరం సౌజన్యంతో బుధవారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రవి రాజు దంపతులు జన్మదిన కేక్‌ను కట్ చేసి వారి దంపతులకు శాలువా కప్పి పూల మాలవేసి సాయిబాబా చిత్రపటాలు ఆలయ నిర్వహకులు రవిరాజుకు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వుంటూ అనేక మందికి సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి, హాస్పిటల్ సిబ్బంది శివయ్య, శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

యల్.ఐ.సి. డాక్యుమెంట్స్ పోయినవి

ఫిర్యాదుదారు యన్.వెంకటేష్, తండ్రి లేట్ యన్.వేణుగోపాల్, 23 సం॥రాలు, డోర్.నెం.4/76, బజారు వీది, కార్వేటినగరం టౌన్ మరియు మండలం, చిత్తూరు జిల్లా. కొన్ని రోజుల క్రితం యన్.కవితకు సంబంధించిన యల్.ఐ.సి. ఒరిజినల్ బాండ్ పేపర్స్ జీరాక్స్ కోసమై వెళ్ళి పైన తెలిపిన యల్.ఐ.సి. ఒరిజినల్ బాండ్ పేపర్స్ పోగొట్టుకుంది. అప్లికేషన్ నెం.MLD01 200409166. పాలసీ నెం. 842048613, 842140164, 842141225, 844138526, 842229400, 845900981 . వ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

ఇట్లు
యన్.వెంకటేష్, సెల్:99665 90626